# దేవుని ప్రజలుగా జీవించడం

# (4:1)

నియమితమైన ప్రమాణాలను అనుసరించి జీవించడానికి ప్రమాణాన్ని సంతకం చేశావా? నీవుగాని, నీ తల్లిదండ్రులుగాని పాఠశాల రూల్సు పాటిస్తామనే కాగితంపై సంతకం చేసియుండవచ్చు. కంపెనీ పాలసీ ననుసరించి నడుచుకుంటానని నీ ఉద్యోగంలో ఒక కాగితంమీద సంతకం చేసియుండవచ్చు. నీవు దాదాపుగా ఏ సంస్థలో చేరినా, నీవు దాని ప్రమాణాలననుసరించి నడుచుకొనేలా ఎదురు చూడబడతావు. (అది సహజమే గదా?)

నేను క్రైస్తవుడనైనప్పుడు, ఒకే ఒక కార్డు సంతకం చేసినట్టు నాకు జ్ఞాపకం ఉంది. ఆ ఆదివారం రాత్రి పాటల పుస్తకం క్రిందపెట్టి ఆడిటోరియం ముందుకు నడుచుకొంటూ వెళ్లాను. నేను పిరికిగా ఉన్నా, నా అరచేతులు చెమట్లు పుట్టుకొచ్చాయి, నా మోకాళ్లు కొట్టుకుంటున్నాయి. నా పేరు అడ్రసుకొరకు సువార్తికుడు ఒక కార్డు చేతికిచ్చాడు. మూడింటిలో ఏదో ఒకదాన్ని కోరుకోమని కార్డు అడిగింది: "నేను బాప్తిస్మం పొందగోరుతున్నా." "నేను నా పాపాలు ఒప్పుకొనగోరుతున్నా." లేక "నేను నా సభ్యత్వాన్ని పెట్టుకోగోరుతున్నా." "నేను బాప్తిస్మము పొందగోరుతున్నా"నన్న దాన్ని గుర్తు పెట్టాను. నేను నీటినుండి వెలుపలికి వచ్చిన తరువాత, సంఘం యొక్క ప్రమాణాల ప్రకారం జీవిస్తాననే దేనిని అడుగుతూ నా సంతకం కోరలేదు. అంటే, సంఘంలో జీవిత ప్రమాణాలు లేవని దాని అర్థం కాదు. అవి ఉన్నాయి. ప్రత్యేకమైన ప్రమాణాలకు దేవుడు మనలను బద్ధులనుగా చేస్తాడు. తన పిల్లలుగా మనం జీవించాలని ఆయన ఎదురు చూస్తాడు.

ఎఫెసీ పత్రికలోని తరువాత భాగంలో, సంఘం కొరకైన కొన్ని ప్రమాణాలను పౌలు సూచిస్తాడు. క్రైస్తవులు జీవించవలసిన తీరును అతడు వర్ణిస్తాడు.

తన పత్రికల్లో ముందుగా చెప్పగల నమూనాను పౌలు అనుసరించాడు – మొదట సిద్ధాంతపరమైన భాగం, ఆ తరువాత అభ్యాస సంబంధమైన భాగం. మొదటి మూడు అధ్యాయాలలో సిద్ధాంతం అధికమైన మోతాదులో ఉంది. 4నుండి 6 అధ్యాయాలవరకు, సిద్ధాంతపు వైపునుండి క్రీస్తునందు జీవించే అభ్యాస సంబంధమైన భాగానికి వచ్చాడు.

సిద్ధాంతపరమైన దానికిని, అభ్యాస సంబంధమైన దానికిని మధ్య వంతెనగా ఎఫెసీ. 4:1 పని చేస్తుంది. "కాబట్టి, మీరు సమాధానమను బంధముచేత **ఆత్మ** కలిగించు ఐక్యమును కాపాడుకొనుటయందు శ్రద్ధ కలిగినవారై, ప్రేమతో ఒకనినొకడు సహించుచు, మీరు పిలువబడిన పిలుపునకు తగినట్టు" నడుచుకొనుడి. *The New Century Version* తర్జుమా చేసిన విధానాన్ని నేను యిష్టపడతాను: "నేను ప్రభువుకు చెందినందుకు

ఖైదీగా ఉన్నాను. దేవుడు తన ప్రజలుగా మిమ్మును కోరుకున్నాడు. దేవుని ప్రజలు నడువవలసిన విధానంలో నడుచుకొనునట్లు నేను మీకు యిప్పుడు చెప్పుతాను." 4నుండి 6వ అధ్యాయంవరకు, యిందులో ఏమి యిమిడి ఉందో పౌలు వర్ణించాడు. దేవుని ప్రజలుగా ఎలా జీవించాలో ఆ మార్గాన్ని అతడు బయలుపరచాడు.

## నడక

పౌలుకు క్రైస్తవ జీవితాన్ని గూర్చిన స్థిరమైన నమ్మకాలున్నాయి. "మీరు పిలువబడిన పిలుపునకు తగినట్టుగా నడుచుకొనవలెనని కోరుచున్నాను" అని 1వ వచనాన్ని NIV తర్జుమా చేస్తుంది. "కోరుతున్నాను" అనేదానికి పౌలు ఉపయోగించిన గ్రీకు పదం *parakaleo* గాఢమైన తన అక్కరను వ్యక్తపరచుతుంది.

నేను జూనియర్ హై స్కూలులో ఉన్నప్పుడు, నాకు అంతా తెలుసు అన్నట్టు ప్రవర్తించేవాడిని. నా జీవితంలోని ఆ కాలంలో నేను నా తండ్రి అనేకసార్లు ఒక విషయంపై సమ్మతించేవారం కాదు. నేను వ్యాపారపు ప్రయాణంలో ఉన్న ఒకప్పుడు, జీవితాన్ని గూర్చి ఆయన నాకొక ఉత్తరం వ్రాశాడు. జీవితాన్ని బాస్కెట్ బాల్ ఆటతో పోల్చి వ్రాశాడు. ఆ ఉత్తరాన్ని కొన్ని సంవత్సరాల క్రిందట కనుగొన్నాను. కాగితం పాతగిలి ముడుచుకు పోయి మెత్తగా అయ్యింది. సిరా రంగు తగ్గింది, అయితే ఆ పదాల్లో ఉన్న అవసరత తగ్గలేదు. ప్రతి వాక్యంలోని శక్తి లేక తీవ్రత చెరగకుండానే ఉంది. ఆ ఉత్తరంలో తన హృదయాన్ని కుమ్మరించినట్టు యింకను విదితంగానే ఉంది.

ఎఫెసీయులకు వ్రాసిన పత్రికలో పౌలు తన హృదయాన్ని కుమ్మరించాడు. వారు పిలువబడిన పిలుపునకు తగినట్టు నడుచుకోవాలని అతడు సంఘాన్ని కోరాడు. ఎఫెసీయులకు పత్రిక వ్రాసి రమారమి రెండువేల సంవత్సరాలు కావస్తుంది, కాని అందులోని శక్తి లేక తీవ్రత యింతవరకు తగ్గనే లేదు. ఎఫెసులోని క్రైస్తవులకు అది ఎంతగా అవసరమైయుండిందో, పిలువబడిన పిలుపునకు తగినట్టుగా నడుచుకొనుడనేది అంత ఆధునికంగాను, బలంగాను నేటికిని అవసరమైయుంది.

ఇంకో కీలక పదాన్ని నీవు యిక్కడ గుర్తించకోరవచ్చు: "తగినట్టు" (గ్రీకు.: *axios*) "తగినట్టు" అంటే అర్థమేమి? మిడ్‌లాండ్, టెక్సాస్ స్థానిక సంఘంలో నేను భాగమై ఉన్నప్పుడు, అప్పుడప్పుడు మేము పిక్‌నిక్స్‌కి, ఐస్‌క్రీమ్ పార్టీస్‌కి వెళ్ళేవాళ్లం. పెద్దవాళ్లం వాలీబాల్ ఆడేవారం, పిల్లలు పైకి క్రిందికి ఎగిరే ఆట ఆడేవారు. పైకి క్రిందికి ఎగిరే ఆటకు పెద్దగా నేర్పు అక్కరలేదు గాని బ్యాలెన్స్ పెట్టవలసి ఉంటుంది. ఒక వ్యక్తి ఒంటరిగా దాన్ని ఆడలేడు. పైకి క్రిందికి ఎగిరే ఆ ఆటకు యిద్దరు కావాలి. పైకి క్రిందికి ఆడే ఈ ఆటకు ఆ ఊగుడు బల్ల చివర యిరువైపుల ఒక మనిషి ఉంటేనే అది పని చేస్తుంది.

"తగినట్టు" అనే పౌలు ఉపయోగించిన పదం, ఈ ఉద్దేశాన్ని తెలియజేస్తుంది. అంటే, "బ్యాలెన్స్‌లో ఉంచేది" అని దాని అక్షరార్థం. సిద్ధాంతం ఆచరణ అనేవాటి మధ్య బ్యాలెన్స్ ఉండాలని పౌలు నిర్బంధించాడు. క్రీస్తు మనకొరకు ఏమి చేశాడు, క్రీస్తునందు మనం ఎవరిమి, క్రీస్తులో మనకు ఏమి ఉంది అనే సంగతులను పౌలు కొంతవరకు

వర్ణించుకుంటూ వెళ్లాడు. బోధను ఎరిగితేనే సరిపోతుందని పౌలు భావించలేదు. మనం ఎవరిమైయున్నామో వారిలా ప్రవర్తించునట్లు, మనమెవరిమై ఉన్నామో మనం ఎరిగియుండాలని అతడు కోరాడు.

మనం ఎవరిమైయున్నామో వారిలా మనం ఎలా మసలుకోవాలో 4నుండి 6 అధ్యాయాలవరకు చూపబడుతుంది. పౌలు మాటలు దేవుని పిల్లలను చిత్రిస్తున్నాయి. మరియు వారు దేవుని పిల్లలుగా జీవించడానికి లోకంలో ఏమి చేయాలో అవి తెలుపుతాయి. ఈ అధ్యాయాల సంక్షిప్త వర్ణన యిక్కడ యివ్వబడింది:

1. ఐక్యత (4:1–16) – క్రీస్తు శరీరంలో ఏకత్వానికి ప్రథమ స్థానం యిమ్ము.

2. పరిశుద్ధాత్మ (4:17–6:9) – దైనిక జీవితంలో దైవభక్తిని తీక్షణంగా వెంటాడుము.

3. వైరుధ్యం (6:10–23) – మార్గంలోని ప్రతి అడుగున అపవాది ప్రతిఘటనను ఎదురు చూడు.

"ఇరుసుకు" ఒకవైపు సంఘాన్ని గూర్చిన విషయ పరిజ్ఞానం ఉంది. కృప యొక్క భావనను గ్రహించడం, విమోచన యొక్క అవసరతను గుర్తెరగడం, మర్మాన్ని గూర్చి ఆశ్చర్యపడడం, రక్షకుని ప్రేమను కొలవడానికి అవసరమైన శక్తి విషయమై యోచించడంతో యిది కూడియుంది.

"ఇరుసుకు" మరోవైపు ఉన్నదాని విషయమేమి? దేవుని సంఘంగా జీవించడాన్ని గూర్చి ఏమి? తీర్పు తీర్చే తత్వం గూర్చిన సమాచారమేమి? చాటుమాటున మాట్లాడేవి యింకా ఎందుకు కొనసాగుతాయి? కట్టడానికి బదులు పడగొట్టడానికి జరిగే కార్యాల విషయమేమి? క్రీస్తు ప్రేమను గూర్చిన ప్రసంగాన్ని ఎంతగానో యిష్టపడుతుండే వ్యక్తి భార్యయెడల లేక భర్తయెడల అట్టి ప్రేమను కనుపరచకపోవడానికి హేతువేమి? "ప్రభువా, నీ నామమును హెచ్చింతును" అనే పాట పాడుతూ, ఆయన దయచేసిన తల్లిదండ్రులను తృణీకరించడం ఏల తటస్థిస్తుంది?

పౌలు యొక్క పరిస్థితిని నీవు గ్రహించావా? దేవుని ప్రజలు ఏమి తెలిసికొనవలెనో అది తెలిసికొనడం మాత్రమే కాదు, దేవుని ప్రజలు ఎలా జీవించాలో ఆలాగున మనం జీవించవలసి ఉంది కూడా.

## పిలుపు

4:1లోని మాటలను మరొకసారి చదువు: "మీరు పిలువబడిన పిలుపునకు తగినట్లుగా నడుచుకొనవలెనని ప్రభువు యొక్క ఖైదీనైన నేను మిమ్మును వేడుకొంటున్నాను." "వేడుకొనుట" లేక "అడుగుట" అనే పౌలు మాటలు తీవ్రతను కనుపరచుచున్నవన్న సంగతిని ముందుగానే చూచాం. మనం ఎవరిమి, క్రీస్తులో మనకేమి ఉంది అనేదానికిని మనం జీవించే విధానానికిని మధ్య అభ్యాస సంబంధమైన వ్యత్యాసాన్ని పిలువబడిన మన పిలుపులోని "తగినట్లు" అనే పదం చూపుతుంది.

ఇంకొక పదాన్ని మనం పరిశీలించుదాం: పిలుపు (గ్రీకు.: *klesis*). "... మీరు

పిలువబడిన పిలుపునకు తగినట్టుగా నడుచుకొనుడి ...” అని పౌలు వ్రాశాడు. “పిలుపు” అంటే ఒక వ్యక్తి “తన చెంతకు చేరునట్టుగా మరి ఒక వ్యక్తి మాట్లాడుట” అనే భావాన్ని దాని మూల పదం సూచిస్తుంది. నా చిన్నతనంలో, మా అమ్మ భోజనం తయారు చేసిన తరువాత ఆమె మమ్మును పిలిచేది. భోజనంకొరకు కుటుంబం కూడి రావాలని ఆమె కోరేది. ఆ క్రియా వాచకం యొక్క ప్రాథమిక ఉద్దేశాన్ని అది పుట్టిస్తుంది. క్రైస్తవులుగా మనం దేవుని వద్దనుండి ఒక పిలుపుపొందాం. తన వాక్యం ద్వారాను, తన కుమారుని ద్వారాను ఆయన మనతో మాట్లాడాడు. మనలో ప్రతి ఒక్కరిని తన చెంతకు కూడి రమ్మని ఆయన కోరుకుంటున్నాడు.

క్రొత్త నిబంధనలో, “పిలుపు” అనేదానికి ఉన్న క్రియా పదం ఒక వ్యక్తికి ప్రత్యేకమైన పేరును నిర్ణయిస్తుంది. మరియ ఒక కుమారుని కంటుందనిన్నీ, ఆ కుమారునికి యేసు అని పేరు పెట్టాలనిన్నీ యోసేపు చెప్పబడ్డాడు (మత్తయి 1:21). ప్రభువైన యేసునకు మనం విధేయతతో లోబడినప్పుడు, దేవుడు మనకు క్రొత్త పేర్లు పెడతాడు. ఆయన మనలను “పరిశుద్ధులని,” “కుమారులు కుమార్తెలని,” “పిల్లలని,” “విమోచింపబడిన వారని,” “క్రీస్తుతోటి వారసులని,” “ఆయన చేసిన పనియని,” “ఆయన యింటివారని” పిలుస్తాడు.

ప్రత్యేకించిన పనికి ఒక వ్యక్తి నియమింపబడినప్పుడు కూడా అదే క్రియా వాచకం కన్పిస్తుంది. తాను అపొస్తలుడుగా ఉండుటకు “పిలువబడినట్టు” పౌలు చెప్పుకున్నాడు (రోమా 1:1). దేవుడు పౌలును ఒక పనికొరకు ఏరి తీసుకున్నాడు. మన పిలుపులో బాధ్యత కూడా ఉంది. పరిచర్య చేయడానికి మనం రక్షించబడ్డాం. ప్రభువైన యేసును లోకానికి సూచించడానికి దేవుడు మనలను ప్రత్యేకించుకున్నాడు.

“పిలుచుట” అనే క్రియా వాచకం వినియోగింపబడిన మూడవ విధానం, విందుకు ఆహ్వానింపబడడాన్ని సూచిస్తుంది. మత్తయి 2లో, పెండ్లి విందును గూర్చిన ఉపమానాన్ని ప్రభువు తెలియజేశాడు. రాజు బహు గొప్ప విందును చేశాడట. ఆ విందుకు జనులను ఆహ్వానించడానికి అతడు తన సేవకులను పంపాడు. దేవుని రాజ్యపు భోజనానికి మనకు వ్యక్తిగతమైన ఆహ్వానం ఉంది. “గొఱ్ఱెపిల్ల పెండ్లి విందుకు పిలువబడినవారు ధన్యులు” అని ప్రకటన 19:9 అంటుంది.

క్రొత్త నిబంధనలో, కోర్టుకు హాజరుకమ్మని యిచ్చే ఆదేశాలుగా “పిలుపు” యివ్వబడినట్టు చివరిగా కన్పిస్తుంది. పేతురు యోహానులు సన్‌హెడ్రిన్ ఎదుటికి పిలువబడ్డారు (అపొ. 4:18). పౌలు ఫేలిక్స్ ఎదుటికి పిలువబడ్డాడు (అపొ. 24:2). సంజాయిషీ చెప్పుమని న్యాయాధిపతి యెదుటికి పిలిచినదానికి కూడా పిలుపు వర్తిస్తుంది. మనం పిలువబడిన దానిలో ఆలాటి భాగం కూడా ఉంది కదూ? న్యాయాధిపతులకు న్యాయాధిపతియైన వానియొద్దకు మనం పిలువబడ్డాం.

దానికున్న సంబంధాలన్నిటితో కలిపి, “పిలవడం” అంటే, వారిని దగ్గరకు తెచ్చునట్టు యితరులను రమ్మనడం అని అర్థం వస్తుంది. కుమారులు, కుమార్తెలని పిలవడంవలన దేవుడు ఈ పనిని జరిగిస్తున్నాడు. సేవ చేయడానికి పిలవడం ద్వారా ఆయన మనలను దగ్గరకు తెచ్చుకుంటాడు. గొఱ్ఱెపిల్ల వివాహ విందుకు వ్యక్తిగతమైన ఆహ్వానం అందించడం ద్వారా ఆయన మనలను దగ్గరకు తెచ్చుకుంటాడు. మన భూ నివాస కాలం ముగిసిన

పిమ్మట న్యాయాధిపతి వద్దకు రమ్మని ఆదేశాలు జారీ చేయడంవలన దేవుడు మనలను యింకను దగ్గరకు తెచ్చుకుంటాడు.

క్రైస్తవులారా, "పిలువబడిన పిలుపునకు తగినట్టుగా ప్రవర్తించుడని" ఎఫెసీయుల పత్రిక మనకు సెలవిస్తుంది. "దేవుడు పిలిచిన పిలుపునకు తగినట్టు నడుచుకొనండి. మీరెవరో మరచిపోకండి. మీ పిలుపునకు తగినట్టుగా నడుచుకొనండి."

ఇది చేసేదానికంటె చెప్పడం సులభమే. "నీవు మాటలు మాట్లాడవచ్చు, కాని నీవు నడక నడుస్తున్నావా?" అని నేడు కొందరంటున్నారు.

## ముగింపు

హై స్కూలు వయస్సులో విద్యార్థులు తరచు గర్వంగా కన్పిస్తారు. స్కూలు యొక్క పద్ధతులు, వాటి విలువలు భద్రంగా కాపాడాలని పాఠశాల అధికారులు నొక్కి చెప్తుతారు. నేను స్కూలుకు వెళ్లిన దినాల్లో సంగతి. తమ పాఠశాల పద్ధతుల ప్రకారం జీవించ పిలుపు యివ్వబడినట్టు యిప్పుడు పెద్దగా ఉన్నవారికి గుర్తు ఉండియుండవచ్చు.

లేఖనాల్లోనైతే, యింకోరకమైన పిలుపుకు తగినట్టు ఆయనలా ఉండ పిలుపు యివ్వబడుతుంది. మనం దేవునికి కుమారులం, కుమార్తెలమైయున్నాం. దేవుని పిల్లలుగా జీవించడం అంటే ఏమో దాన్ని ప్రదర్శించడానికి, దేవుని కుమారుడైన యేసు ఈ లోకానికి అవతరించాడు. మనం పిలువబడిన పిలుపు ఎట్టిదో ఆయన జీవించి చూపాడు. నీవు క్రీస్తునందు పిలువబడిన పిలుపునకు తగినట్టు నడుచుకుంటున్నావా?

ఈ క్రింది పద్ధతులలో నీవు "పిలువబడిన పిలుపునకు తగినట్టు" నడుచుకోవచ్చు: (1) ఆత్మ సంబంధమైన నీ పరిస్థితిని పరిశీలించుకో. నీవు పిలువబడిన పిలుపునకు తగినట్టు లేని లక్షణాలను బయలుపరచునట్టు నీవు దేవుని వేడుకో. (2) అవసరమైన ఒక మార్పును ఏరుకొని లేక కోరుకొని, ఈ వారం దానిమీద ప్రయాసపడుటకు ఆరంభించు. ప్రత్యేకించి ఓ విషయాన్ని మనం చూచినప్పుడు, మార్పు కలుగుతుంది. ఈ వారానికి ఒక దానిపై గురి నిలుపుకో. తరువాత ప్రభువు దినాన ఆరాధనకు నీవు వెళ్లినప్పుడు, "పిలువబడిన పిలుపునకు తగినట్టు" నడుచుకొనడంలో ఒక అడుగు ముందుకు వేసినట్టు సహాయపడిన దేవుని నీవు మహిమపరచగలవు.